International Journal of Academic Research
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

# భారత సంస్కృతిని విలువలను మరియు గ్రామీణ జీవితాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో రచయితల పాత్ర

**టి. జ్యోతి**

ఉపన్యాసకురాలు, తెలుగు విభాగం, రాయగడ స్వయంప్రతిపత్తి కళాశాల, రాయగడ (ఒడిశా)

**కీలక పదాలు:** భారత సంస్కృతి, గ్రామీణ జీవితం, సాహిత్యం, సామాజిక విలువలు, సంప్రదాయాలు, మతసామరస్యం, రచయితల పాత్ర

**సారాంశం:**

భారతదేశం ప్రపంచ దేశాల్లో ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాహిత్య తదితర అనేక రంగాల్లో తనకంటూ ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశానికి ప్రధాన లక్షణం. వర్ణాశ్రమ వ్యవస్థ, యోగ మరియు ధ్యానం, వేదాలు, ఉపనిషత్తులు వంటి తత్త్వజ్ఞాన సంపదలు భారతీయ సంస్కృతికి పునాదులుగా నిలిచాయి. పుట్టుక నుంచి మరణం వరకు జరిగే సంస్కార విధానం, దీపావళి, హోలీ వంటి పండుగలు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, "అతిథి దేవో భవ" వంటి విలువలు భారతీయ గ్రామీణ జీవన విధానంలో సజీవంగా కనిపిస్తాయి. లలితకళలలో కూచిపూడి, భరతనాట్యం, కర్ణాటక, హిందుస్తానీ సంగీత సంప్రదాయాలు ఈ సంస్కృతికి మరింత కాంతిని చేకూరుస్తాయి.

సాహిత్య రంగంలో రవీంద్రనాథ్ ఠాగూర్, మున్షీ ప్రేమ్‌చంద్, విశ్వనాథ సత్యనారాయణ, రావూరి భరద్వాజ్, సి. నారాయణ రెడ్డి వంటి మహనీయులు తమ రచనల ద్వారా భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు, విలువలు మరియు గ్రామీణ జీవన విధానాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర ను పోషించారు. అదేవిధంగా వర్ధమాన మహావీరుడు, గౌతమ బుద్ధుడు, కబీర్, గురు నానక్, చైతన్య మహాప్రభు వంటి మహనీయులు మతసామరస్యాన్ని, సామాజిక సమానత్వాన్ని ప్రచారం చేశారు. రాజా రామ్మోహన్ రాయ్, దయానంద సరస్వతి, శ్రీ అరవింద గోష్ వంటి సంస్కరణవాదులు తర్కబద్ధమైన ఆలోచనలకు ప్రాధాన్యం ఇస్తూ అంధవిశ్వాసాలను నిర్మూలించి, స్త్రీలకు హక్కులు, విద్యను ప్రోత్సహించారు. అట్టి మహనీయుల దృఢ సంకల్పమే నేటి మన ఉత్కృష్ట భారత చరిత్ర.

తుమ్మల సీతారామమూర్తి గారు రచించిన "సంక్రాంతి", భూసరవల్లి వెంకటేశ్వర్లు గారిచే రచింపబడిన పంజరంలో అమ్మ కవితా ఖండిక, గెడ్డాపు సత్యం గారిచే రచింపబడిన "చెట్టు" వంటి కవితా ఖండికలను ఉదాహరణగా తీసుకుని మన భారతీయ విలువలుసాంప్రదాయాలమరియు గ్రామీణ జీవన విధానాన్ని స్పష్టంగా ప్రతిబింబించడం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశంగా ఉంది. రామాయణ, భారత, భాగవతాల వంటి ఉద్గ్రంథాలకు పుట్టినిల్లైన వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భారతదేశం అనేక సంస్కృతులకు, సాంప్రదాయాలకు నిలయంగా నిలిచింది. భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు, విభిన్న వ్యక్తులు మరియు వ్యక్తిత్వాలతో కూడిన మనమందరం భారతీయులం; మన ఐక్యతను ప్రతిబింబించే మన అందరి సమష్టి పరిచయమే భారతదేశం. భారత రాజ్యాంగంలోని 8 వ షెడ్యూల్ ప్రకారం 22 అధికారిక భాషలు గుర్తించబడ్డాయి. 2001 భారత జనాభా గణన ప్రకారం దేశంలో 122 ప్రధాన భాషలు మరియు 1599 ఇతర భాషలు, మాండలికాలు వాడుకలో ఉన్నాయి. అస్సామీ, బెంగాలీ, బోడో,డోంగ్రీ, గుజరాతీ, హిందీ, కన్నడ, కాశ్మీరీ, కొంకణీ, మైథిలీ ,మలయాళం, మణిపురి, మరాఠీ, నెపాలీ, ఒడియా, పంజాబీ, సంస్కృతం, సంతాలి, సింధీ, తమిళం, తెలుగు, ఉర్దూ వంటి భాషలు గొప్ప సాహిత్య సంపదను కలిగినవిగా మన దేశంలో వెలుగొందుతున్నాయి.

భారతదేశం ఒక లౌకిక దేశం. అనేక మతాలకు, విశ్వాసాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. 2011 జనగణన ప్రకారం దాదాపు హిందువులు 79.8 శాతం, ఇస్లామీయులు 14.2 శాతం, క్రైస్తవులు 2.3 శాతం, సిక్కులు 1.7 శాతం, బౌద్ధులు 0.7 శాతం, జైనులు 0.4 శాతం మతాలను అవలంబిస్తున్నారు. తమకు నచ్చిన భగవంతుని ఆరాధించేందుకు, నచ్చిన మతాన్ని స్వీకరించేందుకు భారతదేశంలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛ ఉంది.సంస్కృతి మంత్రిత్వ శాఖ మరియు కేంద్ర క్యాబినెట్ భాషా నిపుణుల కమిటీ సిఫార్సుల ఆధారంగా 2024 అక్టోబర్ నాటికి 11 భాషలు క్లాసికల్ భాషలుగా గుర్తింపు పొందాయి. తమిళం, సంస్కృతం, తెలుగు, కన్నడ, మలయాళం, ఒడియా, మరాఠీ, పాలి, ప్రాకృతం, అస్సామీ, బెంగాలీ భాషలు క్లాసికల్ భాషలుగా తమ ప్రత్యేక హోదా ను పొందాయి.

వేల సంవత్సరాల చరిత్ర, విలువైన ప్రాచీన మరియు స్వతంత్ర సాహిత్యం, ప్రత్యేకమైన శైలి, ఛందస్సులు, కాలక్రమేణా అభివృద్ధి చెందిన సంస్కృతి, సాంప్రదాయాలు, పురాణాలు, భక్తి సాహిత్యం వంటి విశేషాలు మన తెలుగు భాషలో ప్రతిఫలిస్తాయి. ప్రాచీన మరియు శాస్త్రీయ భాషలతో పాటు ఎన్నో మతాలు, విశ్వాసాలు కలిగిన లౌకిక దేశంగా భారతదేశం ప్రపంచ దేశాలలో ఉన్నత స్థానాన్ని పొందింది.

మన దేశపు ఆచారాలు, అలవాట్లు, ఆదరణీయమైన మరియు ఆచరణీయమైన విలువలు భారతదేశాన్ని జ్ఞాన సంపదకు నిలయంగా నిలిపాయి. గౌతమ బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు, కబీర్, గురు నానక్, చైతన్య, రాజా రామ్ మోహన్ రాయ్, స్వామి వివేకానంద, అరవింద ఘోష్, దయానంద సరస్వతి, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి

ఎందరో మహనీయులకు మన దేశం పుట్టినిల్లు కావడం మన గర్వకారణం.వైవిధ్యాన్ని లోకానికి పరిచయం చేసింది మన భారతదేశం.

అహింసను ప్రతిపాదించిన గౌతమ బుద్ధుడు ఆర్య సత్యాలు, అష్టాంగ మార్గాలను బోధించాడు. అహింస, అపరిగ్రహం, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం వంటి సూత్రాలను ప్రతిపాదించిన జైనమతాన్ని వర్ధమాన మహావీరుడు స్థాపించాడు. భక్తి భావాన్ని బలపరచి సామాజిక సమానత్వాన్ని స్థాపించేందుకు కబీర్, గురు నానక్, చైతన్య యత్నించారు.

మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, కుసంస్కారాలతో మగ్గిపోయిన సమాజాన్ని సంస్కరించి పునర్నిర్మించేందుకు సామాజిక, మత సంస్కర్తలు చేసిన కృషి భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించింది. బ్రహ్మ సమాజ స్థాపకుడు రాజా రామ్మోహన్ రాయ్, ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి, "మతం ఒక్కటే" అనే భావాన్ని ప్రతిపాదించిన రామకృష్ణ పరమహంస, రామకృష్ణ మిషన్‌ను స్థాపించిన స్వామి వివేకానంద, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన ఈశ్వరచంద్ర విద్యాసాగర్, ఆలీగఢ్ ఉద్యమానికి నాయకత్వం వహించిన సయ్యద్ అహ్మద్ ఖాన్, సర్వసమత భావం మరియు స్త్రీహక్కులను ప్రోత్సహించిన చట్టంపి స్వామికల్, శివనారాయణ అగ్నిహోత్రి వంటి సంస్కర్తలు విశేష సేవలు అందించారు.వారు న్యాయం, సమానత్వం, మానవత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం, వేదాంత తత్వం, ఆత్మవిశ్వాసం, దేశభక్తి, మానవసేవ వంటి విలువలను ప్రపంచానికి పరిచయం చేశారు.సాహిత్యం విషయానికి వస్తే పుష్కలమైన సాహిత్య సంపద గల దేశం మనది. రవీంద్రనాథ్ ఠాగూర్, మున్షీ ప్రేమ్‌చంద్, విశ్వనాథ సత్యనారాయణ వంటి ఎందరో సాహితీవేత్తలను ప్రసాదించినది మన భారతమాత. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయులు రాజకీయ రంగంలో, సి.వి. రామన్, ఏ.పి. జె. అబ్దుల్ కలాం, హమ్ జి బా బా వంటి శాస్త్రవేత్తలు విజ్ఞాన–సాంకేతిక రంగాల్లో, సినిమా మరియు సంగీత రంగాల్లో లతా మంగేష్కర్, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, క్రీడా రంగంలో సచిన్ టెండూల్కర్, పి.వి. సింధు, మిల్కా సింగ్ వంటి ప్రతిభావంతులు భారతదేశ విలువలను ప్రపంచానికి చాటారు.

అట్టి విలువైన జ్ఞాన సంపదను, సంస్కృతి–సాంప్రదాయాలను, ఆచారాలను, అలవాట్లను, గ్రామీణ జీవన విధానాన్ని, పల్లె సంస్కృతిని, వ్యక్తిత్వ పరమైన విలువలను లోకానికి పరిచయం చేయాల్సిన బాధ్యత మన దేశ పౌరులపై ఉంది; ముఖ్యంగా రచయితలపై ఉంది. వైవిధ్యభరితమైన నాగరికతకు నిదర్శనమైన భారతదేశం విజ్ఞాన–సాంకేతిక రంగాల్లో, అంతరిక్ష పరిశోధనల్లో, ఐటీ రంగ అభివృద్ధిలో విశేష ప్రగతిని సాధించింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం నిలిచింది.సంస్కృతిని కాపాడడంలోను, ప్రపంచానికి పరిచయం చేయటంలోనూ సాహిత్యం యొక్క పాత్ర అత్యంత గౌరవనీయమైనది. ఆధ్యాత్మికత, సహజ జీవనం, సమానత్వం, వ్యవసాయ ఆధారిత జీవన విధానం, పరస్పర సహకారం, రాజకీయ వాస్తవాలు వంటి అంశాలను రచనల్లో ప్రస్తావించి

**International Journal of Academic Research**
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026

ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత రచయితలపైనే ఉంది. తమ భాషలోనున్న ఉత్తమ సాహిత్యాన్ని ఇతర భాషలలోకి అనువదించాలి.

కందుకూరి, గురజాడ వంటి వారు తమ రచనల ద్వారా సంస్కరణలను చూపించి జాగరణ కలిగించి జాతిని జాగృతం చేసి సమాజంలో మార్పును సాధించారు. గ్రామీణ జీవన విధానానికి చెందిన అంశాలు స్వచ్ఛతతో పాఠకులను అలరిస్తాయి. మున్షీ ప్రేమ్‌చంద్, ఫణీశ్వర్ నాథ్ రేణు, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి రచయితలు రైతుల జీవన విధానం, గ్రామీణ సంస్కృతి, రాజకీయ వాస్తవాలు, మానవత్వం, సమస్యలు వంటి అంశాలపై చేసిన రచనలు గ్రామీణ సంస్కృతిని ప్రచారం చేస్తాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో సంస్కృతిని కాపాడుకుని జాతీయతను లోకానికి చాటుతూ జీవన విలువలను ప్రచారం చేస్తూ మార్పును సాధించవలసిన బాధ్యత రచయితలదే.

జనపద సాహిత్యానికి చెందినబుర్ర కథలు, ఓజా పాటలు, సరళమైన భాష మరియు భావగాఢత వంటి ప్రధాన లక్షణాలతో కూడుకొని ఉండే పద్య సాహిత్యం, శ్రీశ్రీ గారి సామాజిక వాస్తవాలను ప్రతిబింబించే మహాప్రస్థానం, వ్యావహారిక భాషలో నాటి సమాజానికి అద్దం పట్టిన గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం, గ్రామీణ జీవన సత్యాలను చాటిచెప్పే చలం గారి కథలు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారి రచనలు, మున్షీ ప్రేమ్‌చంద్ గారి గోదాన్, ఫణీశ్వర్ నాథ్ రేణు గారి మైలాఆంచల్, రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారి అల్పజీవి, కేశవరెడ్డి గారి మునెమ్మ, ఉన్నవ లక్ష్మీనారాయణ గారి మాలపల్లి వంటి రచనలు గ్రామీణ జీవితాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తాయి.

అమృత తుల్యమైన భారత సంస్కృతి ఒక జీవనధి. మన గ్రామీణ జీవన విధానం ప్రేమను పంచే తల్లి ఒడితో సమానం. మన సాంప్రదాయాలు ఇతిహాసపు వేరు. మన కుటుంబ వ్యవస్థ ఆదర్శప్రాయం. మన సంస్కృతి వెలుగులకు జ్యోతి.భూసరవల్లి వెంకటేశ్వరులు గారిచే రచింపబడిన "ఒక అనుభవం నుండి "అనే కవితా సంకలనం నుండి గ్రహింపబడిన "పంజరంలో అమ్మ" అన్న కవితా ఖండికలో గ్రామీణ అందాలను పరిచయం చేయుటతో పాటు పల్లె అందాలతో పోటీ పడుతున్న ప్రకృతి మరియు ప్రకృతి అందాన్ని కోల్పోతున్న తన గ్రామాన్ని తలుచుకుని బాధపడే విధానాన్ని రచయిత చిత్రించారు. ముప్పై సంవత్సరాల క్రితం తన గ్రామాన్ని కవి చిత్రించారు . కవి తన బాల్యాన్ని తన స్వంత గ్రామంలో గడిపి, ఉన్నత విద్య కోసం పట్టణానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ముప్పై సంవత్సరాల తరువాత తన స్వగ్రామానికి వచ్చిన తరువాత గ్రామంలో చోటుచేసుకున్న నైసర్గిక మార్పులు, ప్రజల జీవన విధానం చూసి చలించిపోయారు. వాటిని యథాతథంగా వ్యక్తపరిచారు.

గట్టుదాపలా గూడెంలో సూర్యోదయానికి సంకేతంగా కూసిన కోడి కూత, మామిడాకుల దోసె చివర జారుతున్న మంచు బిందువు, అందులో ప్రతిబింబించిన సప్తవర్ణాలు, మావి చివురు తిని కూసిన కోయిల కూత, డొంకల్లో తీసిన పరుగులు, రేవు నుండి నీళ్లు నింపుకుని మోసుకుని వెళ్లిన కావెల్లు, నదిలో స్నానం చేసిన అమ్మాయిలు, సాంప్రదాయ కట్టు బొట్టు, ఇసుకలో పిచ్చుక గూళ్లు, పండిన పుచ్చకాయలు, రేగుముళ్లు , నదిలో ఈతలు, ఈతలలో వేసే చిందులు, ఆ చిందుల్లో మురిసే నవ్వులు, పంట చేతికి అందాక పొందే ఆనందం ప్రతిఫలించే కళ్లు,

International Journal of Academic Research | P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

చెంగు చెంగున ఎగిరే దూడలు , చల్లను చిలుకుతున్నప్పుడు కవ్వం పాడే సంగీతం, వెన్నముద్ద దొంగతనాలు, వాకిట్లో ముగ్గులు, గంగిరెద్దుల సన్నాయి నాదం, హరిదాసుల చిందులు, బావి గిలక కిలకిలరావం గిత్తల రంకెలు,చింతకాయ పచ్చడి, చెమట చిందే అమ్మలక్కల కష్టాలు, అందాలు, పొలాల్లో వడిసెలు, పండిన జొన్న కంకులు, సాయంకాలం గోధూళి, గంగడోలికి కట్టిన గంటల సవ్వడి, సందెపొద్దు సరాగాలు, అందీ అందని అందాలు, అవి జారిపోతున్నప్పుడు పొందిన అనుభూతులు  ఇలా ఇంకా ఎన్నో అందాలు, పల్లె సొగసులు మనసులను ఆకట్టుకుంటాయి.తన ఊరిని తన తల్లితో భూసరవల్లి వెంకటేశ్వరులు గారు పోల్చారు. అది పల్లెటూరిలో కనుగొనే ఆత్మీయతకు నిదర్శనం.

తుమ్మల సీతా రామమూర్తి గారిచే రచింపబడిన “పరిగపంట “ఖండ కావ్యంలోని సంక్రాంతి అనే ఖండికలో సాంప్రదాయ పండుగైన సంక్రాంతిని వర్ణించారు. గుమ్మడిపువ్వు ఛాయను బోలి పచ్చి పసుపు ముఖానికి రాసుకుని, మిరపపండు లాంటి బొట్టు నుదుట దిద్దుకుని, బంతి చామంతులను మాలగా కట్టి సిగలో అమరించి మకర సంక్రాంతి హేమంత ఋతువులో వచ్చింది. చిక్కటి పాలతో చేసిన పాయసం, వంకాయ కూర, నక్కదోస పచ్చడి, గుమ్మడికాయ పులుసు, గడ్డ పెరుగు, చెరుకు రసంతో ఆరగించడానికి రండని సంక్రాంతి లక్ష్మి పిలుస్తుంది. నెలతప్పిన కోడలి చేత చేయించిన భోగి పొంగలి పూజ, పుట్టింటికి వచ్చిన కూతురిని ముద్దాడిన తల్లి, మరదలితో హాస్యమాడే పెంకె బావ, ముగ్గులు దిద్దే భార్యతో సరసాలాడిన భర్త, ప్రియురాలితో ప్రియుని సరసాలు, చలికారణంగా బిర్రబిగిసిన రోగి, మన్మదుని దయ తన మీద పడని బ్రహ్మచారులు, చెలికాని కౌగిలిలో నలిగిన ప్రేమ, కోడి పందెములు, ఆంధ్రుల శౌర్యము, రంగవల్లికలు, గంగిరెద్దుల పందెములు, గొబ్బి సంబరాలు, పాయసాన్నము, తెలుగు తేజము, భీష్మని అంపశయ్య, కుంటి గృడ్డి అనకుండ, కోరుకున్న వారందరికీ భాగ్యాన్ని కలిగించు మకర సంక్రాంతి లక్ష్మి. ఇలా సంక్రాంతి లక్ష్మి తన సాంప్రదాయాలను చాటుతుంది.

కవితా వైజయంతి అనే కవితా సంపుటి నుండి గ్రహింపబడిన “చెట్టు “అన్న గెడ్డాపు సత్యం గారి కవితా ఖండిక చెట్లను మనం కాపాడితే అది మనలను కాపాడుతుంది అని తెలియజేస్తుంది. పది మందికి జీవనోపాధియై నిలిచిన చెట్టు యొక్క ఔధార్యాన్ని ఈ ఖండికలో చిత్రించారు గెడ్డాపు సత్యం గారు. నేడు పట్టణీకరణ కారణంగా వృక్షసంపదకు ఆఘాతం కలుగుతోంది. పల్లెలు ఇంకా మిగిలి ఉన్నాయి కనుకనే మనం ఆ రైతన్నల పేరుచెప్పుకుని కాస్త ఊపిరి పీల్చుకోగలుగుతున్నాం. ఇందులో ప్రకృతి సౌందర్యంతో పాటు పల్లె అందాలు, ప్రకృతితో సామరస్యంగా గడిపే జీవన విధానం, బాధ్యతాయుతంగా ప్రకృతితో సమన్వయంగా నడుచుట అలవరుచుకోవలసిన విలువలు ప్రతిపాదించబడ్డాయి.

పక్షులకు నివాసమై ఆహారాన్ని అందిస్తూ, కవులకు ప్రేరణను కల్పిస్తూ, గాలిని పవిత్రం చేస్తూ, మనుషుల క్రూరత్వాన్ని తొలగించి మానవత్వాన్ని పెంపొందించేలా హెచ్చరిస్తూ, దివ్యత్వాన్ని ఆపాదించి, ప్రాణుల విషాదాన్ని పారద్రోలుతూ, తనకు హాని చేసే వారికి సైతం సాయం చేసిఔధార్యం, దానగుణం, క్షమ, నిస్వార్థం వంటి విలువలను చెట్లు మనకు నేర్పిస్తున్నాయి.మనిషిని మించిన సంపన్నురాలు చెట్టు, ఆహారం ఇచ్చే త్యాగశీలి, సూర్యునిచే ఆహారం వండించే భాగ్యశీలి, విత్తనాలను దాచే కృషకుడు, మృదుత్వాన్ని అలవరించే పూలు, ప్రాణాలను నిలబెట్టే పండ్లు, ఎండ నుండి

కాపాడే నీడ, ఆశ్రితుల కోరికలను నెరవేర్చే ఘనత పొందినది చెట్టు. త్యాగియైన చెట్టు యోగివంటిది, విష్ణుమూర్తితో సమానం, కష్టంనుండి రక్షించే రాజు చెట్టు, చెక్కు చెదరని ధైర్యంతో కనిపించే దేవత చెట్టు.

నీవు లేక లోకంలో నిప్పు, పొగ, నీడ, బ్రతుకు, ప్రాణం ఏదీ లేదు. ఆదర్శప్రాయం చెట్టు జీవితం. ఇటువంటి విలువలను పెంపొందించే సాహిత్యం మన సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పే సాహిత్యంగా నిలిచి, మరింతగా దేశ అభివృద్ధిని చాటాల్సిన బాధ్యత రచయితలపై ఎంతో ఉంది.

ముగింపు

మొత్తానికి, భారతదేశం వైవిధ్యభరితమైన సంస్కృతి, సాంప్రదాయాలు, భాషలు, మతాలు, జీవన విధానాలతో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. ఈ అమూల్యమైన వారసత్వాన్ని కాపాడుతూ, ప్రపంచానికి పరిచయం చేయడంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తోంది. గ్రామీణ జీవన సౌందర్యం, మానవ విలువలు, ప్రకృతితో మన సంబంధం, సామాజిక వాస్తవాలు వంటి అంశాలను ప్రతిబింబిస్తూ సాహిత్యం మనకు మార్గదర్శకంగా నిలుస్తోంది. అందువల్ల ఈ విలువలను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా, ముఖ్యంగా రచయితలపైనఉంది. మన సంస్కృతి, సంప్రదాయాలు, జ్ఞాన సంపదలను ప్రపంచానికి చాటుతూ, సమాజంలో సానుకూల మార్పును తీసుకురావడం ద్వారా భారతదేశం మరింత గొప్పతనాన్ని సంతరించుకుంటుంది.

**సూచన గ్రంథాలు**


1. తుమ్మల సీతారామమూర్తి – పరిగ పంట ఖండకావ్యం
2. భూసరవల్లి వెంకటేశ్వరులు – ఒక అనుభవం నుంచి (కవితా సంపుటి)
3. గెడ్డాపు సత్యం – కవితా వైజయంతి
4. గురజాడ అప్పారావు – కన్యాశుల్కం
5. శ్రీశ్రీ – మహాప్రస్థానం
6. మున్షీ ప్రేమ్‌చంద్ – గోదాన్
7. ఫణీశ్వర్ నాథ్ రేణు – మైలాఆంచల్
8. రాచకొండ విశ్వనాథ శాస్త్రి – అల్పజీవి
9. ఉన్నవ లక్ష్మీనారాయణ – మాలపల్లి
10. కేశవరెడ్డి – మునెమ్మ
11. భారత రాజ్యాంగం – ఎనిమిదవ షెడ్యూల్ (భాషల గురించి)
12. భారత జనగణన నివేదిక – 2001, 2011
13. భారత సంస్కృతి మరియు సాహిత్యంపై వివిధ విమర్శాత్మక గ్రంథాలు, వ్యాసాలు